ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024 | 5



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించడానికి శుక్రవారం రానున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని వానపల్లి గ్రామంలో జరిగే రెవెన్యూ గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లాలో గత కొన్ని దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారంపై చంద్రబాబునాయుడు దృష్టి సారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

బాబొస్తున్నారు..



నేడు కొత్తపేట మండలం వానపల్లిలో గ్రామసభ

ఉదయం 11.40కు సీఎం చంద్రబాబు రాక

అయినవిల్లిలో హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన అధికారులు

అక్కడి నుంచి రోడ్డుమార్గాన సభా ప్రాంగణానికి

కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

సభా ప్రాంగణాన్ని పరిశీలించిన టీడీపీ నేతల బృందం



ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కొత్తపేట, ఆగస్టు 22: కూటమి ఘన విజయం తర్వాత తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు విచ్చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు పర్యటనకు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. జిల్లా అధికారులతో సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కోరారు. ప్రత్యేక పర్యవేక్షకుడిగా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనస్వాగతం పలకడానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ నాయకులతో కలిసి ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ఏర్పాట్లు పూర్తిచేయడానికి అధికార యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. జేసీ నిషాంతి ఏర్పాట్లు చురుగ్గా సాగేందుకు కింది స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. వానపల్లి ప్రాంతాన్ని పోలీసులు జల్లెడపట్టారు. గ్రామసభ జరిగే ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.



పోలీసు అధికారులతో నేతల చర్చలు



సభా ప్రాంగణం వద్ద సందడి



సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వానపల్లిలో శుక్రవారం జరిగే ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అమలు చేసే ఉపాధి హామీ పనులను రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. దీనిలో భాగంగానే వానపల్లిలో జరిగే గ్రామసభలో చంద్రబాబు పాల్గొంటారన్నారు. గ్రామంలోని పళ్లాలమ్మ అమ్మవారి గుడి వద్ద ఏర్పాట్లు చేస్తున్న కార్యక్రమంలో సభావేదిక ఏర్పాట్లను కొత్తపేట ఆర్డీవో పర్యవేక్షించాలన్నారు. సంపూర్ణ పారిశుధ్య చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యులు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. సీఎం కాన్వాయ్‌కు సంబంధించి వాహనాలు, పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సభా ప్రాంగణానికి చేరుకునే వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు, సిబ్బందికి డ్యూటీ పాస్‌లు, మీడియా ప్రతినిధులకు పాస్‌లు అందించాలని ఆర్డీవోను ఆదేశించారు. సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, మీడియా కోఆర్డినేషన్, చంద్రబాబు పర్యటన లైవ్ కవరేజ్ తదితర అంశాలను జిల్లా పౌరసంబంధాల అధికారి పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, సత్యనారాయణ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర పాల్గొన్నారు.

కోనసీమ రైల్వేలైన్ నిర్మాణ పనులు



మా మొర వినండి బాబూ..

కోనసీమలో ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలు

ప్రతిపాదనలకే పరిమితమవుతున్న పనులు

సీఎం చంద్రబాబుకు మొరపెట్టుకుంటున్న ప్రజలు

ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పన చేయాలని కోనసీమకు చెందిన టీడీపీ, జనసేన కూటమి ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లేందుకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులంతా సమాయత్తమవుతున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

ప్రతిపాదనలెన్నో..

కోనసీమ ప్రజల చిరకాల వాంఛగా మిగిలిన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధులు మంజూరు అవుతున్నా నిర్మాణంలో ప్రగతి శూన్యం.

ప్రధానమైన వశిష్ఠ, వైనతేయ, గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల వెంబడి ఉన్న సారవంతమైన లంక భూములన్నీ నదీ పాతానికి గురవుతున్నాయి. ఈ భూములను పరిరక్షించడానికి ప్రధానంగా రివిట్‌మెంట్లు, గ్రోయిన్ల వంటివి నిర్మించాల్సి ఉంది. ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి.

కేరళ తరహా అందాలను సొంతం చేసుకున్న కోనసీమను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. దిండి రిసార్ట్స్‌తో పాటు కోరంగి మడ అడవులు, గోదావరి నదీ పాయల్లో విహారాలు వంటివి అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దాలనేది ప్రజల ఆకాంక్ష.

పి.గన్నవరం పాత అక్విడెక్టును సుందరీకరించాలి.

ఆధ్యాత్మిక టూరిజం అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలి.

మత్స్యకార గ్రామాలకు నదీపాయల వెంబడి వారధుల నిర్మాణం చేపట్టాలి.

ప్రభుత్వ పరంగా అత్యాధునిక సౌకర్యాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని అమలాపురంలో నెలకొల్పాలనేది ఈ ప్రాంత వాసుల డిమాండ్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు..కోనసీమలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు కోకోనట్ బోర్డు చర్యలు చేపట్టాలి.

-రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ఇంకా ప్రతిపాదన, సర్వేల దశలోనే కొనసాగుతుంది. అమలాపురంలో రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ మార్పు విషయంలో రాజకీయ, ఆర్థిక పరమైన లావాదేవీలతో ముందడుగు పడడం లేదు.

●వశిష్ఠ నదిపై సఖినేటిపల్లి-నర్సాపురం మధ్య వారధి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ప్రగతి శూన్యం.

గోదావరిని ఆనుకుని ఉన్న పిచ్చుకలంక ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలు దశాబ్దాల కాలం నుంచి ఆచరణ సాధ్యం కావడంలేదు.

సెంట్రల్ డెల్టాలో నీటి పారుదల వ్యవస్థకు అతి కీలకమైన ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు పునర్నిర్మాణం చేపట్టాలి.

ఇరిగేషన్, డ్రెయిన్ల వెంబడి కొల్లలుగా పెరిగిపోతున్న ఆక్రమణలు, కట్టడాలు, నిర్మాణాలను తొలగించి వాటిని సుందరీకరణ చేయాలి.

కోనసీమ ముఖ ద్వారమైన రావులపాలెంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.


రావులపాలెంలో ఫ్లైఓవర్ల నిర్మాణానికి జాతీయ రహదారుల శాఖ చర్యలు తీసుకోవాలి.

సుదీర్ఘ సముద్రతీరం ఉన్న కోనసీమలో తీరం వెంబడి ఉన్న భూములు కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.

చమురు, సహజ వాయువుల సంస్థ చేస్తున్న అన్వేషణల వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడంతో పాటు ప్రాణాంతకమైన ప్రమాదాలను నిరోధించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని కోనసీమ కేంద్రమైన అమలాపురంలో సిద్ధంగా ఉంచేలా ఆ సంస్థలు చర్యలు చేపట్టాలి.

ఆర్థిక సంఘం నిధుల విడుదలతో

పల్లెకు కళ



జిల్లాలోని 385 గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెండో విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు విభాగాలుగా రూ.29,69,69,965 విడుదల చేశారు. 15,43,217 మంది జనాభా ఆధారంగా ఆయా పంచాయతీలకు ఈ నిధులను విడుదల చేశారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, విద్యుత్ దీపాలు, తాగునీరు, సిబ్బంది వేతనాల కోసం మొదటి టైడ్ విభాగంలో రూ.17,81,81,955 నిధులు విడుదల చేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అన్‌టైడ్ నిధుల కింద రూ.11,87,87,810 విడుదల చేశారు.

పంచాయతీలకు పూర్వ వైభవం

గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల

ఐదేళ్ల అనంతరం పంచాయతీల్లో కాసుల గలగల

జిల్లాకు రూ.29.69 కోట్లు విడుదల

అమలాపురం రూరల్, ఆగస్టు 22: గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే మాట నిలబెట్టుకుని పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు విడుదల చేశారు. దీంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు తిరోగమన దిశలో ఉన్నాయి. అయితే నేడు పంచాయతీలకు రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన నిధులు ఐదేళ్ల అనంతరం నేరుగా రూ.29,69,69,765 విడుదల కావడం శుభ పరిణామం.

వైసీపీ పాలనలో దుర్భర ఆర్థిక పరిస్థితి

వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలు దుర్భర ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొన్నాయి. కనీసం బ్లీచింగ్ బస్తా కూడా కొనలేని పరిస్థితికి ఎన్నో పంచాయతీలు చేరుకున్నాయి. పంచాయతీల నిధులను జగన్ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి ఇష్టానుసారం దారి మళ్లించింది. రాజ్యాంగబద్ధంగా పంచాయతీలకు రావాల్సిన నిధులు లేవు. ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులకు విధులు కూడా లేకుండా చేసి ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. దీంతో గల్లీ స్థాయి నుంచి సర్పంచ్‌లు ఢిల్లీ స్థాయి వరకు వెళ్లి తమ గోడును కేంద్ర పెద్దలకు విన్నవించుకున్నారు. సర్పంచ్‌లు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిరాహార దీక్షలు, ఆందోళనలు చేశారు. పంచాయతీల్లో దొంగలు పడ్డారని ఆందోళనకు దిగినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

దారి మళ్లించారు..

వైసీపీ ప్రభుత్వంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించారు. పంచాయతీలకు జమ కావాల్సిన నిధులు విడుదలైనట్టు ఒక మెరుపు మెరిసి ఆ నిధులు సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి మాయమైన సందర్భాలు ఎన్నో. అమలాపురం రూరల్ మండలం బండారులంక పంచాయతీ నుంచి సుమారు రూ.50 లక్షలు విద్యుత్ బిల్లుల కోసం తీసుకుని మిగిలిన సొమ్ములు మాయం చేశారు. పేరూరులో రూ.34 లక్షల మేర నిధులను వెనక్కి తీసుకున్నారు. ఇలా జిల్లాలోని అన్ని పంచాయతీల పరిస్థితి ఇదే.

మాట నిలబెట్టుకున్నారు..

నాగాబత్తుల శాంతకుమారి, సర్పంచ్‌ల సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు, మాచవరం



పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్న మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో అభివృద్ధి పనులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. భవిష్యత్తులో ఎప్పుడూ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించకుండా ప్రత్యేక చట్టం చేయడం మంచిది. సర్పంచ్‌ల సమాఖ్య సమావేశాల్లో చంద్రబాబుకు 16 డిమాండ్లతో వినతిపత్రం అందిస్తే సానుకూలంగా స్పందించి అమలు చేసే పని ప్రారంభించారు.

పనులు పరుగులు పెట్టిస్తాం

పెనుమాల సునీత, సర్పంచ్, బండారులంక



మూడేళ్ల క్రితం సర్పంచ్‌లుగా ఎన్నికయ్యాం. పంచాయతీలకు వచ్చే నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడంతో ఏ పనులు చేయలేకపోయాం. ఇప్పటి వరకు గ్రామాల్లో చిన్నపాటి పనులు కూడా చేయలేని దుర్భర పరిస్థితిని అనుభవించాం. ఇక అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తాం.

పంచాయతీలకు నిధుల వరద

రంబాల రమేష్, సర్పంచ్‌ల సమాఖ్య నేత, ఉప్పూడి



సర్పంచ్‌లగా ఎన్నికై ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పంచాయతీలకు జవసత్వాలు నింపేలా నిధులు విడుదల చేయడం శుభ పరిణామం. జనాభా ప్రాతిపదికన విడుదలైన నిధులతో పనులు చేపట్టుకునే అవకాశం కల్పించారు. దానికితోడు ఉపాధి హామీ పథకం కింద మరెన్నో పనులు గ్రామ సభల్లో ఆమోదించుకుని పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తాం.

మండపేటలో 'కమిటీ కుర్రోళ్లు'
7వ పేజీలో

భవిష్యత్ అంతా స్మార్ట్ మెటీరియల్‌దే
7వ పేజీలో

విషాదఛాయలు
అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు స్వస్థలాలకు చేరిక
కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు
7వ పేజీలో

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

జిల్లా మత్స్యకారుల సంఘాల సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



బాధితులకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, ఆగస్టు 22: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వాములు చేసే లక్ష్యంతో ఓడలరేవులో ఫిషింగ్ హార్బరు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈదరపల్లిలోని మత్స్యకార సంఘ సామాజిక భవనంలో గురువారం జిల్లాస్థాయిలోని మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. లంకే భీమరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు బలసాడి రంగారావు హాజరై మాట్లాడుతూ వైసీపీ పాలనలో మత్స్యకారుల జీవన విధానం పూర్తిగా దెబ్బతిందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ నెల 26న ఎన్నికలు నిర్వహించేందుకు మత్స్యశాఖ అధికారులు నోటీసులు అందించినట్టు తెలిపారు. అయితే కోనసీమ జిల్లాకు చెందిన సహకార సంఘాల సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజన జరిగినందున ఏ జిల్లాకు ఆ జిల్లాయే ఎన్నికలు నిర్వహించాలని అప్పుడే మత్స్యకారుల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దాంతో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ కోనసీమ జిల్లా పరిధిలోని ఎన్నికలు నిర్వహించేలా తీర్మానంచేసి కలెక్టర్‌కు నివేదిక అందించాలని మత్స్యశాఖ జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావుకు సూచించారు. పీఎం మత్స్యసంపద యోజన పథకం కింద తీర ప్రాంతం వెంబడి ఉన్న పర్ర భూములు ఆక్రమణలకు గురి కాకుండా మత్స్య సంపదను పెంపొందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 184 మత్స్యకార సొసైటీలు ఉన్నాయని, సభ్యుల తీర్మానం మేరకు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన అంగాని సత్యనారాయణ, ఎస్.యానాంకు చెందిన ఓలేటి శ్రీనివాసరావు ప్రమాదవశాత్తూ మృతి చెందడంతో ఆయా కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున రెండు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో కోనసీమ జిల్లా ప్రతినిధులు ధర్మాడి చినఏడుకొండలు, చింతా శ్రీను, కొల్లు రాంబాబు, మల్లాడి వెంకటరమణ, శేరు శ్రీను, కొప్పాడి దుర్గారావు, పెదశింగు స్వామి, కోలా లక్ష్మణరావు, మత్స్యశాఖ ఎఫ్‌డీవోలు బి.హేమానందకుమార్, అశ్వినీసత్య తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి రేవులో పంటు ప్రయాణం





పెళ్లి బృందాలతో సందడిగా ఉన్న రత్నగిరి ప్రాంగణం

రత్నగిరిపై పెళ్లి సందడి

సత్యదేవుని సాక్షిగా ఒక్కటైన 200 జంటలు

అన్నవరం, ఆగస్టు 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రత్నగిరి గురువారం బాజాభజంత్రీలతో మార్మోగింది. పెళ్లి బృందాలతో కిటకిటలాడింది. రామాలయం ప్రాంగణమంతా మండపాల డెకరేషన్‌తో ప్రత్యేక శోభ సంతరించుకుంది. రాత్రి 11 గంటలు, వేకువజామున 3 గంటల ముహూర్తాల్లో సత్యదేవుని సాక్షిగా సుమారు 200 జంటలు ఒక్కటయ్యాయి. పెళ్లి బృందాలకు గదుల కేటాయింపు తలకు మించిన భారం కావడంతో ఈవో ముగ్గురు సూపరింటెండెంట్లతో కమిటీ వేశారు. ఒక్కో వివాహ బృందానికి కనీసం రెండు గదులను అందించడంతో ఊపిరి పీల్చుకున్నారు. సామాన్యులకు మాత్రం ఇక్కట్లు తప్పలేదు. పెళ్లి బృందాల వాహనాలు హరిహరసదన్, విష్ణుసదన్ కాటేజీల వద్ద రోడ్డుపై భారీగా నిలిచిపోగా సెక్యూరిటీ సిబ్బంది క్రమబద్ధీకరించారు. రద్దీ కారణంగా స్వామివారి వ్రతాలు, సర్వదర్శనాలను శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ప్రారంభించాలని నిర్ణయించారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.70.16 లక్షలు



ఆత్రేయపురం, ఆగస్టు 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు ఎం.లక్ష్మీనారాయణ, పీవీవీఎస్ కామేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. ఆలయంలో 19 హుండీలు ఉండగా భారీ వర్షం కారణంగా 13 హుండీలనే లెక్కించారు. వీటి ద్వారా 39 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.70,16,714 ఆదాయం వచ్చింది. బంగారం 72 గ్రాములు, వెండి 750 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.




ధనస్సు, బాణాన్ని దర్శించుకుంటున్న భక్తులు

బాలరాముడి ధనుర్బాణాలివిగో...

పెద్దాపురం, ఆగస్టు 22: అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహానికి సమర్పించనున్న ధనుర్బాణాలను కాకినాడ జిల్లా పెద్దాపురంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు 13 కిలోల వెండి, కిలో బంగారంతో ధనుస్సు, బాణం తయారు చేయించాడు. రామ మందిరం పూర్తికావడానికి ఇంకా సమయం ఉండడంతో వీటిని ప్రముఖ ఆలయాల్లో భక్తుల దర్శనార్థం తీసుకెళ్తున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధనుర్బాణాలను దర్శించి తరించారు. మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

కోనసీమలో నేడు సీఎం పర్యటన



అమలాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరతారు.

- 11.40 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను కలుసుకుంటారు.
- 11.45 గంటలకు హెలిపాడ్ వద్ద బయల్దేరి రోడ్డు మార్గంలో 11.50 గంటలకు వానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడ జరిగే స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభలో పాల్గొంటారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడతారు.
- రెండు గంటల నుంచి పది నిమిషాల పాటు స్థానిక నాయకులతో ముఖాముఖి మాట్లాడతారు.
- 2.10 గంటలకు వానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బయల్దేరి రోడ్డు మార్గంలో బయలుదేరి హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.20 గంటలకు హెలిపాడ్ నుంచి బయల్దేరి 2.35 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 2.45 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి 3.35 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 3.40 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి నాలుగు గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఇంటికి చేరుకుంటారు.



అయినవిల్లిలో హెలిపాడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



హారిక మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు

లేమ్మా... హారికా

మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



సర్పవరం జంక్షన్, ఆగస్టు 22: వాళ్లది నిరుపేద కుటుంబం... తండ్రి తాపీమేస్త్రీ కాగా తల్లి ఓ చిన్న కిళ్లీ కొట్టు నిర్వహిస్తోంది. ఇద్దరు పిల్లలు. చీకూచింతా లేకుండా ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాన్ని కష్టాలు వెన్నాడాయి. చిన్నప్పుడు కుమారుడు, నాలుగేళ్ల కిందట కొవిడ్‌తో భర్త, ఉద్యోగం సాధించి ఇప్పుడిప్పుడే చేతికి అందివస్తున్న క్రమంలో కుమార్తెను కోల్పోయిన ఆ తల్లి మనోవేదన వర్ణనాతీతం. అమ్మా సెలవు లేదు... మరలా వస్తానని చెప్పి ఇంటినుంచి వెళ్లిన సాయంత్రమే రియాక్టర్ పేలుడు దుర్ఘటనలో కుమార్తె హారిక తీవ్రంగా గాయపడి మృతి చెందిందన్న సమాచారం తెలిసిన వెంటనే ఆ మాతృమూర్తి కన్నీరుమున్నీరుగా విలపించింది. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న కుమార్తె మృతదేహంపై పడి గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

కాకినాడ రెండో డివిజన్ సౌజన్య నగర్‌కు చెందిన చల్లపల్లి ఈశ్వరరావు-అన్నపూర్ణ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె చల్లపల్లి హారిక (22) ఉన్నారు. ఈశ్వరరావు తాపీమేస్త్రీగా కుటుంబాన్ని పోషించాడు. కుమారుడు చిన్నప్పుడే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఈశ్వరరావు కొవిడ్‌తో మృతి చెందాడు. అన్నపూర్ణ కిళ్లీకొట్టు ద్వారా వచ్చిన సంపాదనతో కుమార్తెను మున్సిపల్ హైస్కూల్లో చదివించింది. పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించి మెరిట్ జాబితాలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఒక ఫార్మా కంపెనీలో 2023 సెప్టెంబరులో కెమికల్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరింది. సోమవారం రాఖీ పండుగ కోసం రెండు రోజులు సెలవు పెట్టి కాకినాడలోని ఇంటికి వచ్చింది. రాఖీ పౌర్ణమి రోజున సంతోషంగా సోదరులకు రాఖీ కట్టి ఆప్యాయతను పంచుకుంది. మరో రెండు రోజులు ఉండాలని తల్లి, కుటుంబ సభ్యులు కోరినా సెలవు లేకపోవడంతో బుధవారం ఉదయం బయల్దేరి వెళ్లి ఉద్యోగంలో చేరింది. బుధవారం సాయంత్రం కంపెనీలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో విధి నిర్వహణలో ఉన్న హారిక తీవ్ర గాయాలతో మృతి చెందింది.

హారిక మృతి చెందిందన్న వార్త తెలిసిన వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మృతదేహాన్ని దగ్గరుండి తీసుకురావాలని కాకినాడ అర్బన్ తహసీల్దారు జితేంద్రను ఆదేశించారు. ఆయన ఆర్ఐ బి.రాజు, వీఆర్వో తాతారావుతో కలిసి బుధవారం రాత్రి విశాఖపట్నం వెళ్లి మహాప్రస్థానం వాహనంలో గురువారం ఉదయం మృతదేహాన్ని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హారిక మృతదేహాన్ని చూసిన తల్లి అన్నపూర్ణ, మావయ్య, అత్తలు, పెదనాన్న, పెద్దమ్మ, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు రోజులు ఉండమన్నా ఉండకుండా అనంత లోకాలకు వెళ్లిపోయావా తల్లీ అంటూ వారి రోదించారు. కుటుంబీకుల సమక్షంలో దహన సంస్కారాలు నిర్వహించారు. హారిక కుటుంబానికి రూ.కోటి పరిహారం చెక్కు తీసుకునేందుకు తహసీల్దారు అనకాపల్లి వెళ్లారు.

అసిస్టెంట్ మేనేజరు నాగబాబు మృతి

సామర్లకోటలో విషాదఛాయలు



భార్య, కుమార్తెలతో నాగబాబు (పాత చిత్రం)

సామర్లకోట, ఆగస్టు 22: అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన విస్ఫోటనంలో కాకినాడ జిల్లా సామర్లకోట గాంధీనగర్‌కు చెందిన మొండి నాగబాబు దుర్మరణం చెందాడు. ఉన్నత విద్య అనంతరం ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజరుగా ఉద్యోగంలో చేరిన నాగబాబు భార్య సాయి, కుమార్తె సాన్విత (9), కుమారుడు మాన్వింత్(6)లతో కలిసి విశాఖపట్నంలో నివాసముంటున్నాడు. రోజులాగే బుధవారం కూడా ఉద్యోగానికి వెళ్లిన భర్త ప్రమాదంలో చిక్కుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లాడన్న సమాచారం తెలిసి భార్య నిశ్చేష్టురాలైంది. నాగబాబు తల్లి లక్ష్మి, ఇద్దరు సోదరులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వారంతా బుధవారం రాత్రి హుటాహుటిన విశాఖకు పయనమయ్యారు. మృతదేహాన్ని గురువారం రాత్రి సామర్లకోట తీసుకొచ్చారు. నాగబాబు కుటుంబానికి రూ.కోటి పరిహారం చెక్కు తీసుకునేందుకు తహసీల్దారు అనకాపల్లి వెళ్లారు.

తిరిగిరాని లోకాలకు గణేష్‌కుమార్

మగ దిక్కు కోల్పోయామంటూ కుటుంబీకుల కంటతడి



గణేష్‌కుమార్ (పాత చిత్రం)

బిక్కవోలు, ఆగస్టు 22: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం జువ్వలదొడ్డికి చెందిన కొప్పర్తి గణేష్‌కుమార్ (33) మృతి చెందాడు. గణేష్ తండ్రి సత్యనారాయణకు భవాని టైలర్‌గా గ్రామంలో మంచి పేరుంది. ఈయన ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి గణేష్ ఇంటి బాధ్యతలు చేపట్టాడు. డిగ్రీ చదివిన గణేష్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఓ కుమారుడు కూడా వున్నాడు. తల్లి, చెల్లి, భార్య, కుమారుడికి గణేషే ఆధారం. హైదరాబాద్‌లోని దివీస్ కంపెనీలో పనిచేసిన అతడు మూడేళ్ల క్రితం అచ్యుతాపురంలోని కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధుల్లో చేరాడు. మగదిక్కు కోల్పోయామంటూ గణేష్ తల్లి, చెల్లి, భార్య విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.



సెమినార్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

భవిష్యత్తు అంతా స్మార్ట్ మెటీరియల్‌దే

అంతర్జాతీయ సైన్స్ సెమినార్‌లో శాస్త్రవేత్తల ఉద్ఘాటన

మండపేట, ఆగస్టు 22: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు వారి విలువైన సందేశాలను అందించడం హర్షణీయమన్నారు. సెమినార్ నిర్వహణకు కళాశాల అధ్యాపకులు చేసిన కృషిని వేగుళ్ల కొనియాడారు. 'స్మార్ట్ మెటీరియల్, అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్' అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సెమినార్‌ను మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే వేగుళ్ల జ్యోతిప్రకాశనంతో ప్రారంభించారు. సెమినార్‌కు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మారుతున్న కాలంతో పాటు సమాజంలో స్మార్ట్ మెటీరియల్ అవశ్యకతను దక్షిణ కొరియా నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎన్.నవీన్‌కుమార్, డాక్టర్ ఎన్.భార్గవ్ వివరించారు. తిరుచానపల్లి ఐఐటీ నుంచి వచ్చిన ప్రొఫెసర్ హేమలత నానో టెక్నాలజీ గురించి వివరించారు. డాక్టర్ బిపిన్‌కుమార్ (న్యూఢిల్లీ), డాక్టర్ పి.విష్ణుప్రశాంత్ (తిరుపతి) స్మార్ట్ మెటీరియల్‌పై విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మెటీరియల్ ప్రాధాన్యాన్ని గుర్తించాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు వందకు పైగా వ్యాసాలను సదస్సులో ప్రదర్శించారు. విద్యార్థులు శాస్త్రవేత్తల సందేశాలను విని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మారుమూల పట్టణమైన మండపేటలో ఈ తరహా అంతర్జాతీయ సెమినార్ నిర్వహించడం, అందులో పాల్గొనడం తమకెంతో ఆనందంగా వుందని శాస్త్రవేత్తలు చెప్పారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఎస్‌వీ కిరణ్‌కుమార్, ఎ.ఆనందరావు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గంగా స్నేహభావంతో లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీల్లో దాదాపుగా 40 ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. న్యాయవాదిని నియమించుకునే పరిస్థితి లేనివారు నేరుగా కోర్టు అవరణలో ఉండే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే సహాయం చేస్తారన్నారు. ఎలాంటి ఖర్చు ఉండదని చెప్పారు. కేసు పరిష్కారమైన తర్వాత ఇరుపక్షాలనూ విజేతలుగానే భావిస్తారు. లోక్ అదాలత్ అవార్డు (తీర్పు)పై ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప అప్పీల్ చేసుకునే అవకాశం కూడా లేదన్నారు. ఒకవేళ ఒప్పుకున్న పరిహారం ఇవ్వడంలో ఇబ్బందిపెడితే నేరుగా ఇక్కడే పిటిషన్ వేసుకునే వెసులుబాటు ఉందన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు ఇప్పటిదాకా సుమారు రూ.100కోట్ల పరిహారం అందజేసినట్టు చెప్పారు.

సూత్రధారులెవరో!

- ఇసుక దొంగతనం వ్యవహారంలో ముందుకు కదలని విచారణ
- చర్యలకు ఏవేవో కారణాలు చెప్తున్న రెవెన్యూ అధికారులు



ఇసుక లోడ్ చేసిన లారీని జామాయిల్ తోటలో దాచిన దృశ్యం (పాత చిత్రం)

ఎటపాక, ఆగస్టు 21: వారం క్రితం గుండాల ఇసుక డంప్-2 వద్ద ఇసుకను దొంగతనంగా లారీలో లోడ్ చేసుకుని రవాణా చేస్తూ పట్టుబడిన తెలంగాణకు చెందిన ఇసుక లారీ వెనుక సూత్రధారులు ఎవరనేది రెవెన్యూ అధికారులు ఇంకా తేల్చలేదు. ప్రభుత్వ ఇసుకను దొంగతనం చేసి వారం కావస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే ఇసుక దొంగతనం వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించింది రెవెన్యూ శాఖలోని ఇంటి దొంగల పనేనా... లేక రాజకీయ పార్టీల నాయకుల ప్రోద్బలంతో కొందరు తెర వెనుక ఉండి నడిపించినట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం కిందట గుండాల ఇసుక డంప్-2 నుంచి దొంతనంగా లోడ్ చేసుకుని లారీని ఒడిసా వైపు తరలిస్తుండగా నెల్లిపాక వద్ద కొందరు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించిన విషయం విదితమే. ఆ రోజున ఇసుక డంప్-2లో లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా ఓ విలేకరి వీడియో తీశాడు. స్థానిక రెవెన్యూ సిబ్బంది ఒకరు ఈ వ్యవహారంలో భాగస్వామి అయి తానే దగ్గరుండి నడిపిస్తున్నట్టుగా ఇసుక లారీని ఎందుకు వీడియో తీస్తున్నావు అంటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా ఇసుక లోడింగ్‌కు లోడ్‌కు వినియోగించిన ఎక్స్‌కవేటర్ దొరికినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం లారీని మాత్రమే పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై అనేక ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే నిజాలు నిగ్గుతేలే అవకాశం ఉంది. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దారు పృధ్వీని వివరణ కోరగా... ఆ సమయంలో తాను విధుల్లో లేనన్నారు. లారీని తనకు అప్పగించిన తహసీల్దారు బదిలీ అయ్యారని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చదువుకోమని మందలించారని విద్యార్థిని బలవన్మరణం



సుష్మశ్రీదేవి (పాత చిత్రం)

కరప, ఆగస్టు 22: చదువుకోమని మందలించిన పాపానికి ఆ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడి కుటుంబ సభ్యులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురుకు చెందిన పడాల సుష్మ శ్రీదేవి (19) కోరంగి కేజీపీటీ కళాశాలలో ఫార్మ్-డి చదువుతోంది. చదువులో వెనుకబడుతోందనే ఉద్దేశంతో తల్లి ఆదిలక్ష్మి కుమార్తెను మందలించి బాగా చదువుకోవాలని చెప్పేది. దీంతో మనస్థాపం చెందిన సుష్మ శ్రీదేవి తల్లిని బెదిరిద్దామని ఈ నెల 20వ తేదీ ఉదయం గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి వేరొక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఒక్కగానొక్క కూతురు తమను అర్ధంతరంగా వదిలి వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్, ఆగస్టు 22: తుని, హంసవరం స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొనడంతో సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడి వివరాల కోసం అన్వేషించగా ఎటువంటి గుర్తులు లేవు. నీలం రంగు టీషర్ట్, నీలం రంగు జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ: వ్యక్తి మృతి



మృతుడు మణికంఠ (పాత చిత్రం)

తాళ్లరేవు, ఆగస్టు 22: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ రాఘవేంద్రపురం 216 జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... కాజులూరు మండలం జగన్నాథగిరికి చెందిన జగ్గపు మణికంఠ (30) మట్లపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. చేతికి కడియం వేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రాఘవేంద్రపురం వద్ద 216 జాతీయ రహదారిపై ఎదురుగా యానాం నుంచి వస్తున్న లోడు లారీ ఢీకొట్టింది. మణికంఠకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

హార్లిక్స్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐక్య కూటమిదే విజయం

ధవళేశ్వరం, ఆగస్టు 22: హార్లిక్స్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐదు యూనియన్లు ఐక్య కూటమిగా పోటీ చేసి విజయం సాధించారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 965 ఓట్లు పోలయ్యాయి. ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ, గోదావరి జీఎస్‌కే, జీఎస్‌కే హార్లిక్స్ వర్కర్స్ యూనియన్, చైతన్య ఎంప్లాయిస్ యూనియన్ ఐక్యంగా పోటీ చేసి 729 ఓట్లు పొంది ఘన విజయం సాధించాయి. సీఐటీయూ అనుబంధ ఎస్‌టీసీటీ ఎంప్లాయిస్-వర్కర్స్ యూనియన్‌కి 234 ఓట్లు మాత్రమే వచ్చాయి. రెండు ఓట్లు చెల్లవివిగా నమోదయ్యాయి.

డాక్టర్ రామారెడ్డికి యోగా థెరపీలో పీహెచ్‌డీ పట్టా



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 22: పుదుచ్చేరిలో గురువారం జరిగిన శ్రీబాలాజీ విద్యాపీఠ్ డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టర్ కర్రి రామారెడ్డికి యోగా థెరపీలో పీహెచ్‌డీని చాన్సలర్ రాజగోపాలన్ ప్రదానం చేశారు. యోగా థెరపీలో పీహెచ్‌డీ దేశంలోనే ఇదే మొదటిది. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ శాల్యుటో జెనిసిస్ అండ్ కాంప్లిమెంటరీ మెడిసిన్ ఐఎస్‌సీఎం డైరెక్టర్, యోగాచార్య ప్రొఫెసర్ ఆనంద్ బాలయోగి భవనాని.. డాక్టర్ రామారెడ్డికి పెరల్ ఆఫ్ ఐఎస్‌సీఎం (ఇనిస్టిట్యూట్ ఆణిముత్యం) అవార్డు అందజేశారు.

మండపేటలో 'కమిటీ కుర్రాళ్లు'

సప్తగిరి థియేటర్లో చిత్ర బృందం సందడి

మండపేట, ఆగస్టు 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 'కమిటీ కుర్రాళ్లు' చిత్ర బృందం గురువారం సందడి చేసింది. సినిమా హిట్ కావడంతో ఆ ఆనందాన్ని ప్రేక్షకులతో పంచుకోవడానికి యూనిట్ సభ్యులు సప్తగిరి థియేటర్‌కు వచ్చారు. నిర్మాత కొణిదల నిహారిక, నటులు ప్రేక్షకులతో ముచ్చటించారు. డైరెక్టర్ యదువంశీ షూటింగ్‌కు సంబంధించిన విషయాలను పంచుకున్నారు. సప్తగిరి థియేటర్ యాజమాన్యం మల్లిపూడి గణేష్, ముత్యాల రామకృష్ణ తదితరులు చిత్ర యూనిట్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజరు సుందరం, మల్లేశ్వరరావు, మెగా ఫ్యామిలీ యువత అధ్యక్షుడు కొంత నాగేంద్రప్రసాద్, మోరం బాలాజీ, శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నిర్మాత నిహారిక



అమలాపురం ఏబీసీడబ్ల్యువోగా సుబ్బారావు

రాజమహేంద్రవరంఅర్బన్, ఆగస్టు 22 :రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని బీసీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న ముత్యాల సుబ్బారావును రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిగా నియమించింది. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆయన వెంటనే రిలీవై విధుల్లో చేరారు.

'వరిలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి'

అంబాజీపేట, ఆగస్టు 22: వరిలో ఆశించే పురుగులు, తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ రాజశేఖర్, ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్‌లు పేర్కొన్నారు. అంబాజీపేట మండలం ఇరుసుమండ రైతు సేవా కేంద్రంవద్ద ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ అధ్యక్షతన రైతు విత్తనోత్పత్తిపై సమావేశం నిర్వహించారు. విత్తనోత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పుల్లేటికుర్రుపరిధిలోని వ్యాఘ్రేశ్వరంలో రైతు క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం అధికారులు, వీఏఏ, వీహెచ్‌ఏ, రైతులు పాల్గొన్నారు.

'కిల్కారీ కాల్స్ వినడంవల్ల మాతృ, శిశు మరణాలు తగ్గించవచ్చు'

కపిలేశ్వరపురం, ఆగస్టు 22 : గర్భిణులు కిల్కారీకాల్స్ వినడంవల్ల మాతృ, శిశు మరణాలు తగ్గించే అవకాశం ఉంటుందని అందువల్ల విధిగా అందరూ ప్రజలలో అవగాహన కల్పించాలని రీజనల్ అధికారి ఆర్.మోహనరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం, పీహెచ్‌సీ కేంద్రాల ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లకు కిల్కారీ మొబైల్ సర్వీసెస్‌పై ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతీ ఆశా ఈ శిక్షణ పూర్తిచేసుకుని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీహెచ్‌ఈవో బిషప్, హెచ్ఈ రామారావు, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, మూడు పీహెచ్‌సీల హెల్త్ విజిటర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

'గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి'

ముమ్మిడివరం, ఆగస్టు 22: గ్రామంలో చెరువును ఆధునికీకరించి వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలని తెలుగుదేశంపార్టీ సమావేశం విజ్ఞప్తి చేసింది. ముమ్మిడివరం మండలం అనాతవరంలో కురసాల శివబాబు అధ్యక్షతన గురువారం టీడీపీ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంరీత్యా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని, గ్రామంలో జాతీయ రహదారి రోడ్డు కూడలిలో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటుచేయాలని, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని, కాలనీల్లో డ్రైన్లు, రోడ్లు నిర్మించాలని సమావేశం కోరింది. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అనాతవరం గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30లక్షలు కేటాయించడంపట్ల సమావేశం అభినందనలు తెలిపింది. రైతులకు గోకులం షెడ్లు నిర్మించేందుకు అనాతవరం గ్రామానికి నాలుగు షెడ్లు కేటాయించడంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. మిమ్మితి చిరంజీవి, పేరిచర్ల సురేష్‌రాజు, వలవల శ్రీను, గుబ్బల తాతబ్బాయి, కుంచే శ్రీను, గంధం శ్రీను, మునుకోటి ఏసుబాబు నాయుడు, నిమ్మన వెంకటేశ్వరరావు, అందే శ్రీను, నల్లా అండాళ్‌దేవి, పలువురు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.50వేల విరాళం

అయినవిల్లి, ఆగస్టు 22: తాడేపల్లిగూడేనికి చెందిన కలిశెట్టి వెంకటేశ్వరరావు-రామలక్ష్మి దంపతులు గురువారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు వెంకటేశ్వరరావు దంపతులు రూ.50వేలు విరాళంగా అందించారు. దాతకు ఆలయ అర్చకుడు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోండి

ద్రాక్షారామ, ఆగస్టు 22: కుష్ఠువ్యాధిగ్రస్తులు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ వైద్యాధికారి సీహెచ్. భరతలక్ష్మి అన్నారు. గురువారం రామచంద్రపురంలోని లెప్రసీ కాలనీలో 30మంది వ్యాధిగ్రస్తులకు అల్సర్ కిట్స్, మందులు, నగదు అందజేశారు. స్థానిక వైఎస్ఆర్ నగర్‌లో వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఏరియా ఆసుపత్రిలోని టీబీ, హెచ్ఐవీ ఏయిడ్స్ రోగులకు పలు సూచనలు చేశా రు. కార్యక్రమంలో వైద్యుడు సుధీర్, జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం మురమళ్ల పర్యటన అవాస్తవం: ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఆగస్టు 22: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 27న ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటిస్తారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు స్పష్టం చేశారు. నియోజకవర్గానికి వచ్చి మత్స్యకారులకు ఓఎన్జీసీ అందించే పరిహారాన్ని చంద్రబాబు పంపిణీ చేస్తారని వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. కొందరు కావాలనే ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఆయిల్ కంపెనీలు మత్స్యకారులకు అందించే నిధుల విషయంలో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని మత్స్యకార సోదరులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

కె.గంగవరం: మండలంలోని 26 గ్రామాల్లో శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ కోరారు. ఈ గ్రామ సభల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనుల గుర్తింపుతోపాటు, గ్రామాల్లోని సమస్యలు గుర్తించి, మౌలిక సదుపాయాలు ఇంటింటికీ తాగునీరు, వీధిదీపాల సమస్య, సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలపై చర్చిస్తామని ప్రజలందరూ పాల్గొనాలన్నారు.

ముమ్మిడివరం: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఈనెల 23న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కేవీ నరసింహారావు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టే పనులు ఎంపిక చేయడంతోపాటు విద్యుత్ కనెక్షన్లు, వాటర్ ట్యాప్ కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, గ్యాస్ కనెక్షన్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రజలందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

పి.గన్నవరం: సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు మండలవ్యాప్తంగా ఒకేరోజు, ఒకే సమయానికి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేయనున్నట్లు ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. 20 గ్రామపంచాయతీలవద్ద గ్రామ సభల కోసం ఏర్పాట్లు చేశామన్నారు.

26 నుంచి ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

యానాం, ఆగస్టు 22: యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 26న స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్ ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీలో శిక్షణ పొందేందుకు ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించి 26వ తేదీ ఉదయం 10గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు.





అమలాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన, కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న జనసేన శ్రేణులు



రావులపాలెం కోనసీమ ముఖద్వారం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలి

- వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ ధర్నా

అమలాపురం టౌన్, ఆగస్టు 22: కోల్‌కతా ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ధర్నా చేశారు. దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం రూపొందించాలన్నారు. అత్యాచార నిందితులకు కఠిన కారాగార శిక్ష విధించాలని, అన్ని స్థాయిల్లోను లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, అంగన్‌వాడీ సంఘం జిల్లాశాఖ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, ఆశ జిల్లా అధ్యక్షురాలు ఎస్తేరురాణి, సీఐటీయూ ఉపాధ్యక్షుడు భాస్కరరావు, జనసేన వీర మహిళ కొప్పుల నాగమానస తదితరులు ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా ప్రతినిధి టి.నాగవరలక్ష్మి, ఎం.విజయ, డి.పార్వతి, రత్నకుమారి, దైవకృప, ఈశ్వరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారంపై జనసేన నిరసన

కోల్‌కతా ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జనసేన నాయకుడు ఆర్డీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, పడాల శ్రీదేవి, లింగోలు పండు, ఆకుల సూర్యనారాయణమూర్తి, పోలిశెట్టి బాబులు, కొప్పుల నాగమానస, బట్టు పండు, చిక్కం సుధ, చాట్ల మంగతాయారు పాల్గొన్నారు.

డాక్టర్ మోమితకు న్యాయం చేయాలంటూ నిరసన

రావులపాలెం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ మోమితకు జరిగిన అన్యాయంపై రావులపాలెంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి, ప్రజా సంఘాలు, మానవతావాదుల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ జరిగింది. కోనసీమ ముఖద్వారం వద్ద మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని అతి కిరాతకంగా హింసించి అత్యాచారం చేయడం దారుణమన్నారు. పారా సంస్థ డైరెక్టర్ ఫాదర్ థామస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్, ఉమెన్ యాక్టివిటీస్ పోతుమూడి శేషారత్నం, ఎస్.అరుణకుమార్, యువరాజ్, సాకా రాజారావు, సంగీత, కోనాల రాజకుమార్, ప్రజాసంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలి

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, ఆగస్టు 22: పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ కోరారు. రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో ప్రజలకు సేవచేసి కష్టపడిచేసే అధికారులు మాత్రమే కావాలన్నారు. ఇష్టంలేని అధికారులు వెళ్లిపోవచ్చని సూచించారు. రెవెన్యూ డిపార్టుమెంటులో సర్టిఫికెట్లు కావాలంటే డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. అటువంటి అధికారులు తక్షణమే మానుకోవాలని లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తాగునీటి సరఫరా, గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారులు ఆక్వా రంగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని అటువంటివి తక్షణమే మానుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు లేఅవుట్లకు ఇష్టారాజ్యంగా పర్మిషన్లు ఇస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మండలంలో ఉన్న ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరును రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని, డొక్కా సీతమ్మ ఫొటోను భోజనశాలల్లో ఏర్పాటు చేయాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.బాలాజీ, ఈవోపీఆర్డీ జి.భీమారావు, తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, వైఎస్ఎంపీపీలు యింటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యామ్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్రేయపురం, ఆగస్టు 22: ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ రవికుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయవరం: మండలంలోని చెల్లూరు సబ్‌స్టేషన్‌లో 11కెవి లైన్ మెయింటెనెన్స్ పనులు చేయడంతో ఉదయం 8నుంచి మధ్యాహ్నం1గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందని ఏగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఆనంద్ తెలిపారు.

పి.గన్నవరం: పి.గన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నాగుల్లంక ఫీడర్‌లో వివిధ మరమ్మతులు నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

అంతర్వేది: 33/11 కేవీ లైను వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, సబ్‌స్టేషన్ మెయింటెన్స్, పోల్ షిఫ్టింగ్ పనుల నిమిత్తం మలికిపురం, సఖినేటిపల్లి మండలల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారని సఖినేటిపల్లి ఏఈ బి.ప్రసాద్ తెలిపారు.

అంబాజీపేట బస్టాండ్‌లో లీజుకు ఖాళీ స్థలం

అంబాజీపేట, ఆగస్టు 22: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న 0.56 ఎకరాల ఖాళీ స్థలాన్ని 15ఏళ్లపాటు లీజుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచి నట్లు ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో మేనేజర్ సీహెచ్ ఎస్ఎస్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. టెండర్‌ఫామ్‌లు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఉందన్నారు. 13న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటలలోపు ఈడీ విజయవాడ జోన్-2 కార్యాలయం నందు వేయాలన్నారు. ఆశక్తి ఉన్న ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేనేజర్ కోరారు.

'వరద బాధితులను ఆదుకుంటాం'

మామిడికుదురు, ఆగస్టు 22: వరదలు, వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పాశర్లపూడిలోని బొమ్మిడిపాలెం ప్రాంతంలో వర్షం నీటితో ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన 25 కిలోల బియ్యం, వంటనూనె, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, బోనం బాబు, కిశోర్, విళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



వీఆర్వో సూర్యనారాయణ మృతి

ముమ్మిడివరం, ఆగస్టు 22: ముమ్మిడివరం నగర పంచాయతీ గొల్లలవీధి సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న జి.సూర్యనారాయణ (61) గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సూర్యనారాయణ ఉదయం మృతి చెందారు. సూర్యనారాయణకు భార్య సూర్యావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, వీఆర్వోలు, సూర్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

రొటేరియన్ సూరిబాబు మృతి

మలికిపురం, ఆగస్టు 22: మలికిపురానికి చెందిన ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రొటేరియన్ రుద్రరాజు సూర్యనారాయణరాజు (సూరిబాబు) (72) మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుమారుడు రణధీర్‌ను రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ బత్తుల ఝాన్సీబాయ్, కార్యదర్శి మట్టా రవికుమార్, తోలేటి సతీష్, గెడ్డం తులసీభాస్కర్, గుబ్బల బాబ్జి, నల్లి శివ పాల్గొన్నారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి

రాయవరం, ఆగస్టు 22: వాణిజ్య, వ్యాపార, భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయవరం సహాయఉపాధి కల్పనాధికారి గోదావరి కేశవరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రూ.110రుసుము చెల్లిస్తే కార్మికులకు ఐదు సంవత్సరాల కాలపరిమితికి బీమా సౌకర్యాన్ని అందజేస్తామని చెప్పారు. ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతా, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఫోను నంబరుతో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన వివరించారు.

60 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

ద్రాక్షారామ, ఆగస్టు 22: మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని గురువారం ద్రాక్షారామలో జై ప్రాథమిక కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 60 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ కుమార్ నేత్రపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, కూటమి నాయకులు నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, కర్రానాగేశ్వరావు, మేకా శ్రీనివాస్, దుళ్ల కొండ, తాతపూడి శేఖర్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

యానాం, ఆగస్టు 22: పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 256 అసిస్టెంట్ పోస్టుల భర్తీకిగాను పుదుచ్చేరి డీపీఅండ్ఆర్ నోటిఫికేషన్ జారీ చేసిం ది. డిగ్రీ అర్హత గల పుదుచ్చేరి ప్రాంత నివాసం కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తామన్నారు. సెప్టెంబరు 20న సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

ముమ్మిడివరం, ఆగస్టు 22: మున్సిపల్ కమిషనర్ బదిలీల్లో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.వెంకట్రామిరెడ్డి బదిలీ అయ్యారు. ఆయన్ను ఆళ్లగడ్డ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా ఇంకా ఎవరూ నియమించలేదు.

'ఆడిటోరియం నిర్మాణానికి నిధులిస్తా'

ఉప్పలగుప్తం, ఆగస్టు 22: గొల్లవిల్లి హైస్కూల్లో ఆడిటోరియం నిర్మాణానికి నిధులిస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని పీఆర్ డీఈఈ (ప్రాజెక్టు) అన్యం రాంబాబుకు సూచించారు. గురువారం ఆయన హైస్కూల్‌ను సందర్శించి పరిస్థితిపై ఆరా తీశారు. అటల్ మారథాన్ పోటీల్లో జాతీయ స్థాయిలో స్థానం సాధించిన కుట్టి ఫ్లోర్ క్లీనర్ రోబోట్- 2కె24 రూపకల్పనలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని ఆయన అభినందించారు. హెచ్ఎం లంక రాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణమూర్తి, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, మాజీ సర్పంచ్‌లు అరిగెల నానాజీ, గొలకోటి సత్తిరాజు, గుత్తాల సుభాష్‌చంద్రరావు, రవణం మధు, మద్దింశెట్టి సీతారామస్వామి, చీకట్ల ఏసు, పెయ్యల దుర్గారావు, మధుర ప్రతాప్, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు కోసం చాతుర్మాస దీక్ష: బోనం

రాజోలు, ఆగస్టు 22: చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి అవ్వాలని ఏప్రిల్ 22 నుంచి చాతుర్మాస నవగ్రహారాధన చేస్తున్నానని, ఈ దీక్ష ఆగస్టు 22వ తేదీకి జయప్రదంగా పూర్తి చేశారని హార్టీకల్చర్ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు తెలిపారు. తాటిపాకలో ఆయన గురువారం విలేకరులతో జగనాసురుడు భ్రష్టుపట్టించిన ఈ రాష్ట్రాన్ని చంద్రబాబు మాత్రమే అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. చంద్రబాబు పరిపాలన మీద నమ్మకంతో గతంలో ఎవరూ ఎన్నడూ సాధించలేని ఘన విజయాన్ని ఎన్డీయే కూటమికి ప్రజలు ఇచ్చారన్నారు.

'కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి'

కొత్తపేట, ఆగస్టు 22: కోనసీమ జిల్లాలో కొబ్బరి కార్మికులు, దింపు ఒలుపు, నాణెం, మోతా, తరుగుడు, పీచు, తాళ్లు ఎగుమతిపై ఆధారపడి జీవిస్తున్నారని ఈ ప్రాంతంలో వారి అభివృద్ధికి కొబ్బరిబోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు కోరారు. గురువారం మండల పరిధి వాడపాలెంలో ఎమ్మెల్యే సత్యానందరావును కలిసి వినతిపత్రా న్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి కార్మికులకు కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా 50 ఏళ్ల దాటిన వారికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. దీనిపై బండారు స్పందిస్తూ ఇక్కడ బోర్డు ఆవశ్యకత, కార్మికుల జీవనోపాధి తదితర అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి కొబ్బరి బోర్డు ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు



మామిడికుదురు, ఆగస్టు 22: మామిడికుదురు మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా కుసుమ వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన గతంలో విశాఖపట్నంకు బదిలీపై వెళ్లి తిరిగి ప్రభుత్వ ఆదేశాల మేరకు మామిడికుదురు ఎంపీడీవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మండపేట రూరల్ సీఐగా దొరైరాజు



మండపేట, ఆగస్టు 22: మండపేట రూరల్ సీఐగా పీతల దొరైరాజు గురువారం బాధ్యతలు స్వీరించారు. రామచంద్రపురం సీఐగా పనిచేస్తున్న దొరైరాజు ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో రాజు మండపేట రూరల్ ఎస్.ఐగా పనిచేశారు. విధుల్లో చేరిన ఆయన గురువారం స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. సి.ఐ.రాజును రూరల్ ఎస్.ఐసురేష్‌కుమార్, పోలీసులు కలిశారు.

మండపేట ఎంపీడీవోగా మూర్తి బాధ్యతల స్వీకరణ



మండపేట, ఆగస్టు 22: మండపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.సత్యన్నారాయణమూర్తి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శ్రీదేవి గోపాలపురంనకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మూర్తి ఇక్కడ విధుల్లోచేరి రెండు రోజుల వ్యవధిలోనే అంబాజీపేట ఎంపీడీవోగా వెళ్లిపోయారు విశాఖ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

మున్సిపల్ కమిషనర్‌గా రాజు



అమలాపురం టౌన్, ఆగస్టు 22: అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా కేవీవీఆర్ రాజును నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయనకు అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై అమలాపురం వస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎస్.మనోహర్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం



విక్రమ్ సారాభాయ్‌ను స్మరించుకుంటూ అంజి గీసిన చిత్రం

అమలాపురంటౌన్, ఆగస్టు 22: చంద్రునిపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ అయిన మధుర క్షణాలను స్మరించుకుంటూ ప్రతీఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. భారతదేశ అంతరిక్ష పరిశోధనలో విశేష కృషి చేసిన ఆద్యుడు, భౌతికశాస్త్రవేత్త విక్రమ్‌అంబాలాల్‌సారాభాయ్‌ను స్మరించుకుంటూ కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం ప్రపంచంలోనే ముందుంటుందని పేర్కొంటూ మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం చిత్రంతో చంద్రయాన్-3 ఆయన కుంచె నుంచి జాలువారింది.

36 మందికి ఉద్యోగ అవకాశాలు

అమలాపురంటౌన్, ఆగస్టు 22: అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయంవద్ద గురువారం ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు జాబ్‌మేళా నిర్వహించారు. క్వాస్ కార్పొరేషన్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, అమర్‌రాజా గ్రూపు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగ యువతతో జిల్లా ఉపాధి అధికారిణి యు.వసంతలక్ష్మి మాట్లాడారు. దూరాభారాలను పట్టించుకోకుండా ముందు ఉద్యోగాల్లో చేరాలని మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యువతకు సూచించారు. జాబ్ మేళాలో 36 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు వసంతలక్ష్మి తెలిపారు. రాజ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సేవారంగంలో చిరంజీవి ఎవరెస్టు శిఖరం

- ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే ఆనందరావు
- ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



అమలాపురంలో చిరంజీవి జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేసిన మెగా డాటర్ నిహారిక

ఉప్పలగుప్తం, ఆగస్టు 22: సేవా రంగంలో మెగాస్టార్ చిరంజీవి ఎవరెస్టు శిఖరమని ఎంపీ గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వ్యాఖ్యానించారు. చిరంజీవి పుట్టినరోజు వేడుకలను చిరు, పవన్ అభిమానులు గురువారం గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే, ఎంపీలు ప్రారంభించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, కడియం సందీప్, సత్తి చిన్నా, ఆకుల సూర్యనారాయణమూర్తి, సర్పంచ్‌లు చిక్కం జంగమయ్య, నల్లా బాబండి, అరిగెల నరేష్, నల్లా పవన్, గుత్తాల సుభాష్‌చంద్రరావు, చీకట్ల శ్రీను, మద్దింశెట్టి ప్రసాద్, పిల్లా బుజ్జి, చిక్కం సుధారాణితో పాటు అధిక సంఖ్యలో చిరు, పవన్ అభిమానులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో గురువారం చిరంజీవి జన్మదిన వేడుకలను చిరంజీవి యువత నాయకులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లా నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో చిరంజీవి ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు. చిరంజీవి జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, కల్వకొలను తాతాజీ, నల్లా విష్ణుమూర్తి, యాళ్ల దొరబాబు, నల్లా పవన్‌కుమార్, అల్లాడ స్వామినాయుడు, దాట్ల బాబు, నల్లా శ్రీధర్, లింగోలు పండు, కంచిపల్లి అబ్బులు, చిక్కం సుధ, బట్టు పండు, ఆర్డీఎస్ ప్రసాద్, వర్రే శేషు, దున్నాల దుర్గ, పిండి రాజా, చిక్కాల సతీష్, స్వామి పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకల్లో నిహారిక సందడి

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం రాత్రి అమలాపురం లలిత థియేటర్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. నాగబాబు కుమార్తె, సినీ నిర్మాత నిహారిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మెగా అభిమానులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఆమె కట్ చేశారు. అనంతరం థియేటర్‌లో ప్రదర్శిస్తున్న కమిటీ కుర్రోళ్లు సినిమాను ప్రేక్షకులతో కలిసి కొద్దిసేపు తిలకించి వారితో ముచ్చటించి సందడి చేశారు. చిత్ర నటీనటులకు యాజమాన్యం తరపున కె.త్రినాథ్‌స్వాగతం పలికారు. కార్యక్రమంలో తోట రాము, ఎం.మామాజీ, ఆకుల హరి, చిరు అభిమానులు యేడిద శ్రీను, నల్లా చిట్టిబాబు, నల్లా నాయుడు, మేడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పేద ప్రజల కోసం మెగాస్టార్ చిరంజీవి చేసిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా స్థానిక హైస్కూల్ ఎదురుగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, సుంకర బాలాజీ, దొమ్మేటి సాయికృష్ణ, కొర్లపాటి డీల్లి, దొమ్మేటి రామారావు, రవణం రాము, వలవల బాబి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ముమ్మిడివరంలో ప్రముఖ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమాని, అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్‌ను కట్‌చేసి పంచారు. కార్యక్రమంలో యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాస్, యలమంచిలి బాలరాజు, కిరణ్, మెండి కొండబాబు, మెల్లం రాంబాబులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రతి వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో సినీహీరో మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. చాకలిపాలెంలో చిరు, పవన్ సేవాసమితి అధ్యక్షుడు కందాల చంటి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకుల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. విద్యార్థులకు చంటి ఏర్పాటుచేసిన విద్యాసామగ్రిని ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా 33వ సారి రక్తదానం చేసిన కందాల చంటిని ఎమ్మెల్యే అభినందించి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. ఆయా కార్యక్రమాలలో సర్పంచ్ పత్తిపాటి ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, పల్లి మోషే, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: చిరంజీవి జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో సఖినేటిపల్లి, మలికిపురం మండలాల చిరు, పవన్ రామచరణ్ సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు వంద మంది రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎల్ఎస్ ల్యాండ్‌మార్కు అధినేత లింగోలు పెద్దబ్బులు, రావి మురళీ, ముదిగొండ బుజ్జి, మల్లిపూడి సత్తిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: రాజోలు తాలూకా చిరంజీవి సేవాసమితి అధ్యక్షుడు గుండాబత్తుల తాతాజీ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలను అప్పనపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరంలో సేవా సమితి సభ్యులు పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గెడ్డం మంగాలక్ష్మి, అడబాల తాతకాపు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, జాలెం శ్రీనివాసరాజా, తులా ఆది, కంకిపాటి నరసింహారావు, పోతు కాశీ, తులా శ్రీను, గెడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు అల్లవరం మండలం డి.రావులపాలెంలో గురువారం ఘనంగా జరిగాయి. చిరంజీవి అభిమానులు కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. అడ్వకేట్ తిక్కా వెంకటప్రసాద్, తిక్కా బాబి, కొల్లా తమ్మయ్య నాయుడు, పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి, కొల్లా బాబ్జి, నామన చిన్న, వంటెద్దు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: సినీహీరో, మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈతకోటలో వీవీ వినాయక్ సేవా సమితి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు, స్వీట్లు పంపిణీ చేశారు.

కొత్తపేట : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పాత బస్టాండ్ సెంటర్‌లో అభిమానుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ సంబరాలు నిర్వహించారు. అభిమానులు విళ్ల వీరమారుతీప్రసాద్, చోడపనీడి శ్రీనివాసరావు, ముద్రగడ దుర్గాప్రసాద్, రాయి దుర్గారావు, చోడపనీడి రాంబాబు, నిమ్మకాయల చిన్నయ్యనాయుడు, చోడపనీడి సూరిబాబు, గాది దుర్గానాయుడు, చోడపనీడి శివ, వాకాటి నాగు, చింతం శివ, నిమ్మకాయల సాయి పాల్గొన్నారు.

అంతర్వేది: రామేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటారు. అనంతరం సఖినేటిపల్లి మండల మెగా అభిమానుల ఆధ్వర్యంలో కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచారు. పేదలకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నామన నాగభూషణం, కొణతం నరసింహారావు, బొరుసు రామకోటి, పాటబళ్ల సూరిబాబు, బళ్ల వెంకటేశ్వరరావు, కూన నాగేశ్వరరావు, నరహరశెట్టి శ్రీను, చల్లా శ్రీను, మంగళంపల్లి అంజిబాబు పాల్గొన్నారు.